

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 27 | హైదరాబాద్ | మంగళవారం | 14-07-2026 | పేజీలు: 08


# పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

ప్రభుత్వ ప్రాధాన్యతలపై హరీశ్‌రావు ధ్వజం

మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీపై భారీ వ్యయాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి

సంక్షేమానికి నిధులు లేవని చెప్పడం విరుద్ధమని విమర్శలు

ఫుట్‌బాల్ టోర్నీల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సమంజసం కాదన్న హరీశ్

అదే నిధులతో పాఠశాలలు, కళాశాలలు నిర్మించవచ్చని సూచన

రైతుబంధు పంపిణీని కూడా ప్రచార కార్యక్రమంగా మార్చేశారని విమర్శ

ఖమ్మం సభ కోసం వేల బస్సులు నడిపి భారీగా ఖర్చు చేశారన్న వ్యాఖ్యలు

ప్రజాధనాన్ని ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఆరోపణ

ఖజానా ఖాళీగా ఉందనే ప్రభుత్వ వాదనను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత

సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): ప్రభుత్వం ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతూనే మరోవైపు భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, లక్షల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులను ఎలా చేపడుతోందని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ టోర్నీలు, ఇతర ప్రచార కార్యక్రమాల కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ నిధులతో అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని సూచించారు.

పక్క రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు ప్రభుత్వ నిధులతో పూర్తి పేజీ ప్రకటనలు ఇవ్వడం, రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును కూడా భారీ ప్రచార కార్యక్రమాలుగా మార్చడం ప్రజాధన దుర్వినియోగమేనని హరీశ్‌రావు ఆరోపించారు. రైతుబంధు నిధుల పంపిణీ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన సభ కోసం వేలాది బస్సులు ఏర్పాటు చేసి భారీగా మిగతా 2లో..

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

అస్సాంకు చెందిన 27 మందికి ఊరట కల్పించిన అత్యున్నత న్యాయస్థానం

విదేశీయులుగా ప్రకటించే ప్రక్రియ చట్టబద్ధంగా, న్యాయసమ్మతంగా ఉండాలని స్పష్టం

పౌరసత్వం రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఒకటని వ్యాఖ్య

అక్రమంగా పౌరసత్వం పొందకుండా నిరోధించే అధికారం కేంద్ర ప్రభుత్వానిదేనని వెల్లడి

చిన్నపాటి స్పెల్లింగ్, టైపింగ్ తప్పిదాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవద్దని సూచన

గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులను పక్కన పెట్టిన ధర్మాసనం

కేసులను మళ్లీ విచారించాలని ట్రైబ్యునళ్లకు ఆదేశాలు

పునర్విచారణ పూర్తయ్యే వరకు 27 మందిపై ఎలాంటి బలవంతపు చర్యలు వద్దని స్పష్టం

న్యాయపరమైన ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచన

వ్యక్తిగత హక్కులు, దేశ భద్రత రెండింటి మధ్య సమతుల్యత అవసరమని వ్యాఖ్య



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియలో పూర్తి పారదర్శకత, న్యాయబద్ధత, సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించడం అనేది అతని జీవితాన్ని పూర్తిగా ప్రభావితం చేసే అత్యంత తీవ్రమైన నిర్ణయమని పేర్కొన్న ధర్మాసనం, అలాంటి నిర్ణయాలు తీసుకునే సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. అస్సాంకు చెందిన 27 మంది పిటిషనర్లకు తాత్కాలిక రక్షణ కల్పిస్తూ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఈ కేసును విచారించిన ధర్మాసనం పౌరసత్వం, విదేశీయుడనే హోదా సాధారణ పరిపాలనా అంశాలు కావని, అవి రాజ్యాంగపరంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి భారత పౌరుడా, కాదా అనే నిర్ణయం అతని ప్రాథమిక హక్కులు, జీవనోపాధి, ఓటు హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కు, దేశంలో నివసించే హక్కు వంటి అనేక అంశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని గుర్తు చేసింది. అందువల్ల అలాంటి నిర్ణయాలు చట్టబద్ధమైన ఆధారాలపైనే తీసుకోవాలని స్పష్టం చేసింది. అదే సమయంలో భారతదేశంలో అక్రమంగా పౌరసత్వం పొందే ప్రయత్నాలను అడ్డుకోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతేనని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశ భద్రత, సరిహద్దుల రక్షణ, చట్టవిరుద్ధ వలసలను నియంత్రించడం మిగతా 2లో..

V

# పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

కేసీఆర్‌పై ఎంపీ చామల తీవ్ర విమర్శలు

కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శ

మంత్రి పదవి రాక టీడీపీని వీడారంటూ ఆరోపణ

బీఆర్ఎస్‌కు రక్తదాహం, ధనదాహం, అధికార దాహమంటూ విమర్శ

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం

విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు కారణమయ్యారని ఆరోపణ

కమిషన్లే తప్ప రైతులకు నీళ్లు ఇవ్వలేదని మండిపాటు

బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య

ఈటల గెలుపులో బీఆర్ఎస్ పాత్ర ఉందని ఆరోపణ

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టికెట్ కోసం తన కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందంటూ ఎద్దేవా చేశారు. మంత్రి పదవి దక్కలేదనే మిగతా 2లో..



# బనకచర్లపై ఏపీకి వెంటనే నోటీసులు ఇవ్వలేం



02

సుప్రీంకోర్టు కీలక నిర్ణయం.. తెలంగాణ అభ్యర్థనకు నిరాకరణ

నిబంధనలకు విరుద్ధంగా పిటిషన్ లిస్ట్ అయిందని వ్యాఖ్య

ఒరిజినల్ సూట్ విధివిధానాలు పాటించాలని స్పష్టం

ముందుగా చాంబర్ జడ్జి ముందే పిటిషన్ దాఖలు చేయాలని సూచన

రిజిస్ట్రీ నిబంధనలను ప్రస్తావించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం

ప్రక్రియ పూర్తికాకముందే బెంచ్ ముందుకు రావడంపై అభ్యంతరం

ప్రతివాదులకు నోటీసులు జారీ చేసే దశ ఇంకా రాలేదన్న కోర్టు

తెలంగాణ ప్రభుత్వ వాదనను ఈ దశలో స్వీకరించని సుప్రీంకోర్టు

నిబంధనల ప్రకారమే తదుపరి విచారణ ఉంటుందని స్పష్టం

బనకచర్ల వివాదంలో కీలక పరిణామం

# సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయి

నైనీ కోల్‌బ్లాక్ ఇచ్చిన మోదీకి కృతజ్ఞతలు: కిషన్‌రెడ్డి

కొత్తగూడెంలో బీజేపీ సింగరేణి భరోసా యాత్రలో కేంద్రమంత్రి ప్రసంగం

వేలం లేకుండా తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు చారిత్రక నిర్ణయమని వ్యాఖ్య

సింగరేణికి అండగా నిలిచిందే మోదీ ప్రభుత్వమని వెల్లడి

అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని వ్యాఖ్య

కార్మికుల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని మండిపాటు

మెస్సీతో ఫుట్‌బాల్ కోసం సింగరేణి డబ్బులు ఖర్చు చేస్తారా? అంటూ ప్రశ్న

సింగరేణిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని కేసీఆర్‌పై విమర్శలు

సింగరేణి వ్యవహారాల్లో కేంద్రానికి పెత్తనం ఉండదని స్పష్టం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మిగతా 2లో..

# రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి

కేంద్రం, యూపీకి సుప్రీంకోర్టు నోటీసులు

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదిక సమర్పించాలని సిట్‌కు ఆదేశం

కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, ట్రస్టుకు నోటీసులు జారీ

సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభం

సిట్ సభ్యుల వివరాలు కూడా నివేదికలో పొందుపరచాలని ఆదేశం

స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని యూపీ ప్రభుత్వం వెల్లడి

ఆ నివేదికను పిటిషనర్లకు ఇవ్వడంపై కోర్టులో వాదోపవాదాలు

పిటిషనర్లకు చట్టబద్ధంగా నివేదిక అందుతుందని స్పష్టం చేసిన ధర్మాసనం

దర్యాప్తులో పర్యవేక్షణ లోపాలు వెలుగులోకి వచ్చినట్లు వెల్లడి

తదుపరి విచారణ జులై 20కి వాయిదా



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసు దర్యాప్తు చేపడుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటివరకు చేసిన విచారణకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అలాగే దర్యాప్తు బృందంలో ఉన్న సభ్యుల వివరాలు, వారి బాధ్యతలు కూడా నివేదికలో పొందుపరచాలని మిగతా 2లో..

# తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు

విజేతలకు భట్టి విక్రమార్క అభినందనలు

టీజీ20 సీజన్-1 విజయవంతంగా ముగియడంపై హర్షం

నిర్వాహకులు, స్పాన్సర్ల కృషిని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి

ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డారని ప్రశంస

గ్రామీణ యువతకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని వ్యాఖ్య

హైదరాబాద్ ఈ-చాంపియన్స్ జట్టుకు అభినందనలు

ఖమ్మం ఏసెస్ జట్టు పోరాట పటిమ ప్రశంసనీయం

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి టీజీ20 దోహదపడుతుందని ఆశాభావం



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం): తెలంగాణలో క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిన టీజీ20 సీజన్1 విజయవంతంగా ముగియడం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి టోర్నీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.టోర్నీని విజయవంతంగా నిర్వహించిన మిగతా 2లో..

## పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

మొదటిపేజీ తరువాయి



ఖర్చు చేశారని, అది కూడా ప్రభుత్వ ధనమే నని వ్యాఖ్యానించారు.
ఇలాంటి కార్యక్రమాలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం, రైతులకు, ఉద్యోగులకు, సంక్షేమ పథకాలకు మాత్రం నిధులు లేవని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజాధన వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని, ఖజానాలో నిజంగా నిధుల కొరత ఉంటే భారీ ప్రాజెక్టులు, ప్రచార కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్న డబ్బు ఎక్కడి నుంచి వస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు

మొదటిపేజీ తరువాయి

నిర్వాహకులకు, సహకరించిన స్పాన్సర్లకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్ల ఆటగాళ్లు, కోచ్‌లు, సపోర్టింగ్ స్టాఫ్ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి టోర్నీ విజయానికి తోడ్పడ్డారని కొనియాడారు.
గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ ప్రతిభను గుర్తించి వారికి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడంలో ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రికెట్‌తో పాటు అన్ని క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువ క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. టీజీ20 సీజన్1 ఫైనల్‌లో ఉత్కంఠభరిత పోరులో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈచాంపియన్స్ జట్టుకు భట్టి విక్రమార్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం ఏసెస్ జట్టు కూడా చివరి వరకు అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిందని ప్రశంసించారు. విజేతలు, రన్నరప్ జట్లతో పాటు టోర్నీలో పాల్గొన్న అన్ని జట్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.
రాష్ట్రంలో ఇలాంటి క్రీడా పోటీలు మరిన్ని నిర్వహించడం ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు తెలంగాణ నుంచి మరింతగా ఎదిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

మొదటిపేజీ తరువాయి

కారణంతోనే కేసీఆర్ తెలుగుదేశం పార్టీని వీడి బయటకు వచ్చారని ఆరోపించారు.
పార్టీ స్థాపించిన తర్వాత తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుని ఎన్నికలు, కలెక్షన్లు చేశారని చామల విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం తప్ప ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించి ఇంటికే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.
తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను రెచ్చగొట్టి, వారి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని ఆరోపించారు. పిట్టకథలు చెప్పి ప్రజలను నమ్మించి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు.
అధికారంలో ఉన్న పదేళ్లలో కమిషన్లు దండుకోవడం తప్ప రైతులకు సాగునీరు అందించేలా ఒక్క ఎకరానికైనా కొత్తగా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. *"పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది"* అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్లు విసిరారు. 2009లోనే కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారని, అంతకుముందు ఉద్యమంలో ఆయన పాత్ర పెద్దగా కనిపించలేదని చామల వ్యాఖ్యానించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను కేసీఆర్ ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించడంలో బీఆర్ఎస్ పరోక్షంగా సహకరించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీల రాజకీయాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు.



## ముఖ్యమంత్రి పైన యాలాల పోలీస్ స్టేషన్ లో, బీఆర్ఎస్ మండల నాయకుల ఫిర్యాదు

**యాలాల జూలై 13(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై యాలాల మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థులు మరియు రైతులను ఉద్దేశించి హింసను ప్రేరేపించేలా ఆత్మహత్యలకు వశీకలిపే విధంగా వివాస్పద, ప్రమాదకరమైన, వ్యాఖ్యలను చేసినందుకు గాను భారతీయ న్యాయ సంహిత 2023 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసిందిగా కోరుతూ యాలాల పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చారు. కార్యక్రమంలో సిద్రాలప శ్రీనివాస్,మాజీ జెడ్పిటిసి ,కే.కృష్ణకుమార్ ఏఎంసీ మాజీ డైరెక్టర్,కే. మల్లేశం గ్రామ కుర్వ సంఘం అధ్యక్షుడు, రవికుమార్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, కే,మొగులప్ప,మెట్లి కృష్ణ,యూత్ జనరల్ సెక్రెటరీ,కృష్ణ, పాల్గొన్నారు.




# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

మొదటిపేజీ తరువాయి

వంటి అంశాల్లో కేంద్రానికి రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని తెలిపింది. అయితే ఆ అధికారాలను వినియోగించే సమయంలో న్యాయపరమైన విధానాలను విస్మరించరాదని, ప్రతి వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది.
ఈ కేసు అస్సాంలో విదేశీయుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించినది. పిటిషన్ దాఖలు చేసిన 27 మంది తమ కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారని, తమ పేర్లు పాత ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అయితే పాత ఓటర్ల జాబితాల్లో వారి పేర్ల స్పెల్లింగ్‌లో ఉన్న చిన్నచిన్న వ్యత్యాసాలు, టైపింగ్ తప్పిదాలు, భాషా మార్పుల కారణంగా వచ్చిన అక్షర దోషాలను ఆధారంగా తీసుకుని సంబంధిత విదేశీయుల ట్రైబ్యునళ్లు తమను విదేశీయులుగా ప్రకటించాయని వారు సుప్రీంకోర్టుకు వివరించారు.
పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల పేర్లు వేర్వేరు కాలాల్లో వేర్వేరు విధాలుగా నమోదు కావడం అసాధారణం కాదన్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, అస్సామీ, బెంగాలీ వంటి భాషల మధ్య పేర్ల అనువాదంలో, స్పెల్లింగ్‌లో మార్పులు సహజమని తెలిపారు. ఇలాంటి చిన్నపాటి పొరపాట్లను ఆధారంగా తీసుకుని వ్యక్తులను విదేశీయులుగా ప్రకటించడం న్యాయసమ్మతం కాదని వాదించారు.
ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు కూడా పత్రాల్లో ఉన్న చిన్నచిన్న స్పెల్లింగ్ లేదా టైపింగ్ లోపాలను మాత్రమే ఆధారంగా తీసుకుని ఒక వ్యక్తి పౌరసత్వంపై తుది నిర్ణయానికి రావడం సరైన విధానం కాదని అభిప్రాయపడింది. ప్రతి కేసును అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలు, కుటుంబ సంబంధాలు, పాత ప్రభుత్వ రికార్డులు, స్థానిక పరిస్థితులు, ఇతర ధ్రువపత్రాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. ఈ సందర్భంగా గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అయితే పిటిషనర్లు సమర్పించిన పౌరసత్వ ఆధారాలను తాము ఈ దశలో పూర్తిగా పరిశీలించడం లేదని కూడా స్పష్టం చేసింది. పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకోవడం ట్రైబ్యునళ్ల బాధ్యతేనని పేర్కొంటూ, కేసులను మళ్లీ విచారించాలని ఆదేశించింది.
పునర్విచారణ సందర్భంగా పిటిషనర్లు సమర్పించే అన్ని పత్రాలు, కుటుంబ వంశవృక్షం, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులు, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలను సమగ్రంగా పరిశీలించాలని ట్రైబ్యునళ్లకు సూచించింది. ప్రతి వ్యక్తికి తన వాదనను



పూర్తి స్థాయిలో వినిపించుకునే అవకాశం ఇవ్వాలని, సహజ న్యాయసూత్రాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించింది. మరోవైపు, పునర్విచారణ పూర్తయ్యే వరకు ఆ 27 మంది పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వారిని నిర్బంధించడం, దేశం విడిచి వెళ్లాలని ఒత్తిడి చేయడం లేదా ఇతర పరిపాలనా చర్యలు చేపట్టరాదని తెలిపింది. దీంతో వారికి తాత్కాలిక రక్షణ లభించింది.
అస్సాంలో అక్రమ వలసదారుల గుర్తింపు అంశం దశాబ్దాలుగా అత్యంత సున్నితమైన అంశంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులు, జాతీయ పౌరుల నమోదుపత్రం (ఎన్ఆర్సీ) ప్రక్రియ, పౌరసత్వ వివాదాలకు సంబంధించిన కేసులు తరచుగా న్యాయస్థానాల ముందుకు వస్తున్నాయి. ఈ తాజా తీర్పు కూడా అలాంటి కేసుల్లో న్యాయపరమైన ప్రక్రియ ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే, ఒకవైపు దేశ భద్రతను కాపాడుతూ అక్రమ వలసలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అని, మరోవైపు నిజమైన భారత పౌరులు అన్యాయానికి గురికాకుండా చట్టబద్ధమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణ జరగాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందని సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా స్పష్టం చేసింది. వ్యక్తిగత హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, దేశ ప్రయోజనాలు.. ఈ మూడింటి మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని ధర్మాసనం తన వ్యాఖ్యల ద్వారా మరోసారి నొక్కి చెప్పింది.

## సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయి

మొదటిపేజీ తరువాయి

సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సంస్థకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశంలో బొగ్గు గనులను ప్రధానంగా వేలం ద్వారానే కేటాయిస్తూ వచ్చారని కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ప్రత్యేక చొరవతో వేలం లేకుండా తాడిచర్ల2 కోల్‌బ్లాక్‌ను కేటాయించారని చెప్పారు. అలాగే ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను కూడా సింగరేణికి ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం సంస్థ పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.
సింగరేణి ప్రస్తుత పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో సంస్థను అభివృద్ధి చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. గతంలో డబ్బులు తీసుకుని బొగ్గు గనులు కేటాయించారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ హయాంలో అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తుచేశారు. బొగ్గు గనుల కేటాయింపులో పూర్తి పారదర్శకత ఉండాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.
సింగరేణి కార్మికుల కష్టార్జిత సంపదను పాలకులు దోచుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. సంస్థలో బొగ్గు నిల్వలు తగ్గిపోయాయని చెబుతూ కేటీఆర్, హరీశ్‌రావు కేంద్రానికి లేఖలు రాశారని, కానీ సింగరేణి వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఏమిటో వారికి తెలియదా అని ప్రశ్నించారు.
సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్



ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? ప్రజల సొమ్మును ఇలాంటి కార్యక్రమాలకు వెచ్చించడం సమంజసమేనా? అంటూ కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సింగరేణిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేశారని, సంస్థ నిధులను ప్రజా ప్రయోజనాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపించారు.
పదేళ్లపాటు కేసీఆర్ సింగరేణిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. సంస్థ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్ సింగరేణికి దక్కినప్పుడు మాత్రం కేసీఆర్ స్పందించలేదని వ్యాఖ్యానించారు. సింగరేణిలో ఏ సమస్య వచ్చినా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరైంది కాదని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థపై కేంద్రానికి ప్రత్యక్ష పెత్తనం ఉండదని, సంస్థ పరిపాలన రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే సాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

## బనకచర్లపై ఏపీకి వెంటనే నోటీసులు ఇవ్వలేం

- **సుప్రీంకోర్టు కీలక నిర్ణయం.. తెలంగాణ అభ్యర్థనకు నిరాకరణ**
- **నిబంధనలకు విరుద్ధంగా పిటిషన్ లిస్ట్ అయిందని వ్యాఖ్య**
- **ఒరిజినల్ సూట్ విధివిధానాలు పాటించాలని స్పష్టం**
- **ముందుగా చాంబర్ జడ్జి ముందే పిటిషన్ దాఖలు చేయాలని సూచన**
- **రిజిస్ట్రీ నిబంధనలను ప్రస్తావించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం**
- **ప్రక్రియ పూర్తికాకముందే బెంచ్ ముందుకు రావడంపై అభ్యంతరం**
- **ప్రతివాదులకు నోటీసులు జారీ చేసే దశ ఇంకా రాలేదన్న కోర్టు**
- **తెలంగాణ ప్రభుత్వ వాదనను ఈ దశలో స్వీకరించని సుప్రీంకోర్టు**
- **నిబంధనల ప్రకారమే తదుపరి విచారణ ఉంటుందని స్పష్టం**
- **బనకచర్ల వివాదంలో కీలక పరిణామం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఒరిజినల్ సూట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం, కేసు విచారణ నిబంధనలకు అనుగుణంగా జరగాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా బెంచ్ ముందుకు లిస్ట్ అయిందని ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం



చేసింది. ఒరిజినల్ సూట్‌కు సంబంధించిన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అలాంటి కేసులు నేరుగా బెంచ్ ముందు విచారణకు రాకూడదని, ముందుగా నిర్దేశిత విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేసింది.
రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి పరిశీలనకు సమర్పించాల్సి ఉంటుందని ధర్మాసనం వెల్లడించింది. చాంబర్ జడ్జి అనుమతి, ప్రాథమిక పరిశీలన పూర్తైన తర్వాతే తదుపరి న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొంది. ఆ దశ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని కోరడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ముందుగా ఒరిజినల్ సూట్‌కు సంబంధించిన అన్ని విధివిధానాలు పూర్తికావాల్సి ఉంటుందని, అనంతరమే కేసు తదుపరి దశకు వెళ్తుందని స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలాంటి నోటీసులు జారీ కాలేదు. నిబంధనల ప్రకారం పిటిషన్ ప్రక్రియ పూర్తైన తర్వాతే ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ఈ న్యాయ వివాదంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేసింది. ఈ కేసులో సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను విచారణకు స్వీకరించిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, అలాగే ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది.
ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు ఎంతవరకు పురోగమించిందో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందా? ఇందులో భాగమైన అధికారులు ఎవరెవరు? వంటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని పేర్కొంది.
ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, దర్యాప్తు కొనసాగుతోందని, స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. దర్యాప్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను బహిరంగంగా వెల్లడించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఆ నివేదిక ప్రతిని తమకు కూడా అందించాలని కోరారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన మెహతాకు ధర్మాసనం స్పందిస్తూ, *"మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు"* అని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది.
అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ ప్రాథమిక విచారణలో విరాళాల లెక్కింపు ప్రక్రియలో పలు భద్రతా లోపాలు, పర్యవేక్షణలో తీవ్రమైన వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడైంది. విరాళాల లెక్కింపు సమయంలో అమలు కావాల్సిన నియంత్రణ వ్యవస్థలు సరిగా పనిచేయలేదని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు పలువురు నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తు సందర్భంగా నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు విరాళాల నిర్వహణలో పనిచేసిన కొందరు ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది పాత్రపై కూడా అధికారులు దృష్టి సారించారు. ప్రాథ



మిక నివేదికలో పలు సందర్భాల్లో విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు సిట్ గుర్తించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేయగా, ట్రస్టులో పరిపాలనా మార్పులు చేపట్టారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు ప్రారంభించారు.
అయితే తనపై వస్తున్న ఆరోపణలను చంపత్ రాయ్ ఖండించారు. సిట్ తుది నివేదిక వెలువడిన తర్వాత అన్ని ఆరోపణలకు ఒక్కో అంశంపై సమాధానం ఇస్తానని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన అయోధ్య రామాలయంలో విరాళాల నిర్వహణపై అవినీతి ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదిక కోరడం, కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, ట్రస్టుకు నోటీసులు జారీ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. జులై 20న జరిగే తదుపరి విచారణలో సిట్ సమర్పించే నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు దిశపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.



## గోల్నేపల్లి ప్రాథమిక పాఠశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవం

**వలిగొండ జూలై 13(ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోల్నె పల్లి గ్రామంలో సోమవారం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సోలి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా చిన్న పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం నులిపురుగుల నులి పురుగులు మందులను గ్రామ సర్పంచ్ మరియు ఆశ వర్కర్స్ విద్యార్థి విద్యార్థులకు మందిరము అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాణి మధు మాట్లాడుతూ ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలు యుక్తవయస్కులలో పేగు పురుగుల ఇన్ఫెక్షన్లను నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని తెలిపారు. మందులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శాలిని,ఆశా వర్కర్ కాసుల సుష్మ ,ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,అంగన్వాడి టీచర్ వసంత,గ్రామ పెద్దలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్, జిపి కార్యదర్శుల సంఘం అధ్యక్షులకు సన్మానం

**కోటగిరి,జులై 13( ప్రజాక్షేత్రం):**
కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన పుల్కంటి కృష్ణ కుమార్ ను, కోటగిరి మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎత్తొండ జిపి సెక్రెటరీ ఉదయ్ భాస్కర్ లను కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోటగిరి సర్పంచ్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బర్ల మధుకర్, జిపి సెక్రెటరీ సందీప్ లు మాట్లాడుతూ ఉమ్మడి కోటగిరి పతంగల్ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా ఎన్నికైన కృష్ణకుమార్ కు, కోటగిరి మండల జిపి సెక్రెటరీల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఉదయభాస్కర్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. నేటి సమాజంలో పత్రికా రంగం లో పనిచేయడం అంటే కత్తి మీద సాములా ఉందని అలాంటి రంగంలో జర్నలిస్టుల ఉనికిని చాటుతూ జర్నలిస్టులకు గుర్తింపు తెచ్చేందుకు పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టు సేవలను సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి కోటగిరి పోతంగల్ మండలాల్లో ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు మరువలేవని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణ ను సన్మానించడం గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలపై నూతన అధ్యక్షుడు పోరాడాలని ఆకాంక్షించారు. అలాగే జిపి కార్యదర్శుల సమస్యలపై పోరాడేందుకు ఏర్పాటు చేసుకున్న మండల కార్యదర్శుల సంగం అధ్యక్షుడిగా ఎన్నికైన ఉదయభాస్కర్ అధ్యక్షుడిగా మరిన్ని సేవలందించి కార్యదర్శులకు అండగా నిలవాలని కోరారు. వీరిద్దరూ తమ పదవీకాలంలో కొత్త ఉత్సాహంతో మంచిగా పని చేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అలీనా తఫిన్,వార్డు మెంబర్లు మిర్ల సతీష్,పత్తి అబ్బయ్య, కన్నం శ్రీనివాస్,గగన్,అఫ్రోజ్, శైబాజ్ ఖాన్,సంధ్యారాణి,సాజిదా బేగం,లక్ష్మి,జిపి సిబ్బంది చిత్తరి సాయిలు, గంగామణి తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ఫిర్యాదు

**పెద్దేముల్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రత్యర్థులు, రైతులను ఉద్దేశించి హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఆరోపిస్తూ, ఆయనపై భారతీయ న్యాయ సంహిత, 2023 ప్రకారం కేసు నమోదు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ సోమవారం తాండూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం జూలై 11న హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ముఖ్యమంత్రి చేసినట్లు పేర్కొన్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉండటంతో పాటు రాజకీయ ప్రత్యర్థులు, రైతులపై హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఆరోపించారు.
ఈ వ్యాఖ్యలు సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని, ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.అందువల్ల భారతీయ న్యాయ సంహిత (BNS), 2023లోని సంబంధిత సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు.అలాగే ద్వేషపూరిత ప్రసంగాలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావిస్తూ, చట్టం ముందు అందరూ సమానమేనని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తులైనా చట్టానికి అతీతులు కాదని వినతిపత్రంలో పేర్కొన్నారు.సంబంధిత నాయకులు, వారి కుటుంబ సభ్యులు, రైతుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశం ఆసక్తికరంగా మారింది.వినతి పత్రాన్ని సమర్పించిన సమయంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ వెంట మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చాకలి రంగయ్య, కుమ్మరి విఠల్,గోపాల్ పూర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.








# పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా

- **పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రభుత్వం**
- **67 మంది లబ్ధిదారులకు రూ.67.07 లక్షల కళ్యాణలక్ష్మి.**
- **షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
- **అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**
పేదింటి ఆడపడుచుల వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పెద్దేముల్ మండలానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.67,07,772 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించడమే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పాలనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్,ఎస్ఐఆర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు,మండల, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషికి విశిష్ట అవార్డు

- **సేవకు గుర్తింపే అవార్డు.. రవీందర్‌కు ఎక్సలెంట్ పురస్కారం**
- **కళా సమ్మేళనంలో సేవా భావానికి గౌరవం**

**కుత్బుల్లాపూర్ జూలై 13 (ప్రజాక్షేత్రం):**
సుజనాన ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల కళా సమ్మేళనం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో సామాజిక, పర్యావరణ సేవల్లో విశేష కృషి చేస్తున్న కోలా రవీందర్ ముదిరాజ్ ఎక్సలెంట్ అవార్డు-2026 ను మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ వేణుగోపాల చారి ఘనంగా ప్రదానం చేసి సన్మానించారు.
ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల చారి మాట్లాడుతూ సమాజ సేవ చేస్తున్న వారిని గౌరవించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, ప్రతి ప్లాట్‌లో ఇంకుడు గుంతలు, ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, చిన్నారులకు ఈతపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై రవీందర్ ముదిరాజ్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. అలాగే చిన్నారుల్లో కళా ప్రతిభను వెలికితీసే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి కళలు, సంస్కృతిపై ఆసక్తి పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు.
అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురికి అవార్డులు ప్రదానం చేయగా, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. అవార్డు స్వీకరించిన కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర కుమార్ పూనా,డాక్టర్ సముద్రాల శ్రీదేవి, డాక్టర్ భాగ్యలక్ష్మి రెడ్డి,వీరభోగ వసంతరాయులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.






## సాయిబాబా నగర్‌లో యూజీడీ సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు

- **జనాభా పెరిగినా...యూజీడీ మాత్రం పాతదే!**

**కుత్బుల్లాపూర్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**
సాయిబాబా నగర్ 292వ డివిజన్‌లో కాలక్రమేణా జనాభా పెరిగినా, రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన యూజీడీ పైప్‌లైన్లనే వినియోగించడంతో డ్రైనేజీ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ సూచన మేరకు స్థానిక నాయకులు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ప్రజావాణిలో డీజీఎం శ్రీవాణికి వినతి పత్రం అందజేశారు.
కృషి కాలనీ స్ట్రీట్ నంబర్-1లో ఉన్న పాత యూజీడీ పైప్‌లైన్ ప్రస్తుత అవసరాలకు సరిపోక డ్రైనేజీ నీరు తరచూ రోడ్లపైకి పొంగిపొర్లుతోందని, దీంతో దుర్వాసనతో పాటు పారిశుద్ధ్య సమస్యలు నెలకొంటున్నాయని వివరించారు. అలాగే స్ట్రీట్ నంబర్-8లోని 40 అడుగుల రోడ్డుకు ఇప్పటి వరకు యూజీడీ సౌకర్యం లేకపోవడంతో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. మరాఠీ బస్తీ (సిద్ధార్థ నగర్)లో కూడా చిన్న పరిమాణం గల పాత పైప్‌లైన్ కారణంగా ఇదే పరిస్థితి నెలకొన్నందున అక్కడ కూడా భారీ సామర్థ్యం గల కొత్త యూజీడీ లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ ముదిరాజ్,మరాఠీ బస్తీ అధ్యక్షుడు అశోక్, కిషోర్ ముదిరాజ్,వేణు ముదిరాజ్, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లపై ఎన్ఫోర్స్మెంట్ మెరుపు దాడులు

- **7 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు**
- **పలు హోటల్ల యజమానులపై కేసు నమోదు**

**కోటగిరి,జులై 13(ప్రజాక్షేత్రం):**
నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రలోని పలు హోటల్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై సోమవారం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ డీటీ హనుమాన్లు మాట్లాడుతూ జిల్లా సివిల్ సప్లై అధికారి ఆదేశానుసారం విశ్వసనీయ సమాచారం మేరకు నలుగురు డిటి ల బృందంతో కోటగిరి మండల కేంద్రంలోని పలు హోటల్లు, ఫాస్ట్ ఫుడ్లలో తనిఖీలు నిర్వహించి 7 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హోటల్ వ్యాపారులంతా తప్పనిసరిగా కమర్షియల్ సిలండర్లు మాత్రమే ఉపయోగించాలని ఆయన సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్స్ సిలిండర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆయన వెంట డిటి లు శ్రీనివాస్, వినోద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ వేడిలో రక్తదానం.. విద్యార్థి విభాగం వినూత్న నిరసన

- **రక్తం ఇచ్చి నిరసన..ర్యాలీకి బ్రేక్ వేసిన పోలీసులు**
- **రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్వీ భగ్గుమన్నది.. రక్తదానంతో నిరసన**

**కుత్బుల్లాపూర్ జూలై 13 (ప్రజాక్షేత్రం):**
తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరం రాజకీయ నిరసనకు వేదికగా మారింది. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి రైతులకు నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం అనంతరం ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి తమ నిరసనను తెలియజేయాలని విద్యార్థి నాయకులు ప్రయత్నించగా, పోలీసులు వారిని మార్గమధ్యంలో అడ్డుకుని అదుపులోకి తీసుకుని అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో తెలంగాణ భవన్ పరిసరాల్లో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థి నాయకులు కొర్ర ప్రవీణ్ నాయక్, నిశాంత్‌తో పాటు పలువురు రక్తదానం చేశారు.అలాగే బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శంభీపూర్ కృష్ణ, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్వీ నాయకులు మనీష్,హోమ్, కిరణ్,సాయి,కార్తీక్,కరీం తదితరులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు.








## రెసొనెన్స్ కళాశాలపై చర్యలకు జంకుతున్న అధికారులు

- **బోర్డు లేదు,అసంపూర్తిగా బిల్డింగ్ పనులు**
- **గుట్టుచప్పుడు కాకుండా కళాశాల నిర్వహణ**
- **తల్లిదండ్రులకు కుచ్చుటోపీ పెడుతున్న రెసొనెన్స్ యాజమాన్యం**
- **చరవాణీకి స్పందించని డిఐఈవో**

**శంషాబాద్ జులై13(ప్రజాక్షేత్రం):**
రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి జోన్ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫార్మ్ వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా రెసొనెన్స్ జూనియర్ కళాశాలను నిర్వహిస్తూ తల్లిదండ్రుల విద్యార్థులకు కుచ్చుటోపి పెడుతున్న యాజమాన్యం. ఈ కళాశాలకు బిల్డింగ్ అనుమతులే కాదు కదా విద్యాశాఖ ఇంటర్ బోర్డ్ నుండి కూడా ఎలాంటి సరైన అనుమతులు లేకుండానే లక్షల్లో ఫీజులు దండుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలోనే పాఠ్యపుస్తకలను విక్రయిస్తూన్నారు.ఈ కళాశాలపై విద్యార్థి సంఘాలు పలుమార్లు విద్యాశాఖకు ఫిర్యాదు చేసిన పలు పత్రికల్లో కథనాలు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు.జిల్లా డిఐఇఓ కు ఫిర్యాదు చేసేందుకు చేరవాణిలో సంప్రదించగా ఫోన్ ఎత్తి సమాధానం చెప్పిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు.రెసోనెన్స్ కళాశాల యాజమాన్యంతో డిఐఈఓ కుమ్మక్కు అయి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ లక్షల్లో ఫీజులు దోచుకుంటూన్నారని బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు. ఫిర్యాదులకు స్పందించకుండా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తూ యాజమాన్యానికి సహకరిస్తూ విద్యార్థుల జీవితాల్లో చెలగాటమాడుతున్న డిఐఈఓపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రెండుగ్రామాల సర్పంచ్

**మద్దూర్ పట్టణం జూలై 13 (ప్రజాక్షేత్రం):**
ఏళ్ల తరబడి చూసిన గ్రామీణ ప్రజల కళా సహకారమైంది మోమీనాపూర్ నుండి బండగొండ వరకు బీపీ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో గ్రామాల్లో సంబరాలు అంబరాన్నంటాయి ఈ సందర్భంగా మోమిన పూర్ గ్రామ సర్పంచ్ గుల్ల రవికుమార్, బండగొండ సర్పంచ్ రామచందర్ రైతులందరూ కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ ఇన్చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త రహదారి తో గ్రామాల మధ్య రాకపోకలు మరింత వేగవంతంగా కానుండగా వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సైతం సులభం కానందుని రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బిజెపి సర్పంచ్ భర్త కాంతారావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- **కెవిపిఎస్,ప్రజా సంఘాల డిమాండ్.**

**యాలాల జూలై 13(ప్రజాక్షేత్రం):**
యాలాల మండల కేంద్రంలో సంఘం కుర్దు గ్రామ సర్పంచ్ భర్త కాంతారావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప మాట్లాడుతూ.. యాలాల మండలం సంఘం కుర్దు గ్రామంలో రాత్రి 7 గంటల ప్రాంతంలో గ్రామ సర్పంచ్ భర్త కాంతారావు గారి అనుచరులైన మోత్కూరి బుగ్గప్ప, బంకుల నర్సింలు, మరి కొంత మందితో కలిసి దళిత మహిళ అయినా సిరి గాని సాయమ్మ మరియు సిరి గాని అంజమ్మ గారి యొక్క ఇంటి మీదకు వచ్చి కులం పేరుతో దూషించి దౌర్జన్యంగా, అకారణంగా దాడి చేసిన బిజెపి సర్పంచ్ భర్త కాంతారావు పై ఎస్సీ, ఎస్టి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరిగిన సహనంతో, ఓపికతో పిలిచి మాట్లాడాల్సిన బాధ్యత సర్పంచ్, పైన ఉంది. కానీ ఇవి ఏవి పట్టించుకోకుండా, భర్త కాంతారావు దళితుల యొక్క ఇండ్లలోకి వెళ్లి దౌర్జన్యం అక్కడ చేయడం మంచిది పద్ధతి కాదని అన్నారు. సంగం కుర్దు గ్రామంలో అధికారిక, అనధికార, కార్యక్రమాలలో కూడా సర్పంచ్ కు బదులుగా భర్త కాంతారావు పెత్తనం కి చలయిస్తున్నారని తెలిపారు. ఇలా పెతనం చేయడం చట్ట విరుద్ధమని ప్రభుత్వాన్ని గుర్తు చేశారు. గ్రామంలో ఉన్న సమస్యల పైన మాట్లాడకుండా, పట్టించుకోకుండా, పేద ప్రజల పైన దళిత మహిళలపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తక్షణమే దళిత మహిళలు అయినా సిరిగాని అంజమ్మ, సాయమ్మ, పై దాడి చేసిన బిజెపి సర్పంచ్ భర్త కాంతారావు, మరి కొంతమంది పైన చట్టపరమైన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్వ సంఘం మండల నాయకులు మల్లేశం, మండల నాయకులు కోస్గి వెంకటయ్య, దళిత నాయకులు మలిగేరి నర్సింలు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.








# దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి... బహదూర్‌పల్లి ప్రజల సహనానికి పరీక్ష

- **మురుగు పారుతుంటే... పాలన ఎక్కడ?**
- **స్కూల్–యూనివర్సిటీ దారిలో మురుగు ప్రవాహం**
- **విద్యార్థుల కష్టాలు పట్టించుకునేదెవరు?**

**కుత్బుల్లాపూర్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**
అభివృద్ధి,మౌలిక సదుపాయాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలు మౌలిక సమస్యలతోనే నరకయాతన అనుభవిస్తున్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్డు మొత్తం మురుగు కాలువను తలపించేలా మారింది. శ్రీకృష్ణ హోటల్ ఎదురుగా ప్రారంభమై ప్రభుత్వ పాఠశాల వెనుక గేటు వరకు సుమారు అర కిలోమీటర్ మేర మురుగునీరు రోడ్డుపై పారుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**విద్యాసంస్థల దారిలోనే మురుగు ప్రవాహం**
ఈ రహదారిపై ప్రభుత్వ హైస్కూల్, మల్లారెడ్డి యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. మురుగు నీటి మధ్య నడుచుకుంటూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంస్థల పరిసరాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.

**ప్రజారోగ్యంపై ముప్పు...అధికారుల మౌనం**
ఓపెన్ డ్రైనేజీ కారణంగా మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మీద నడవలేని పరిస్థితి నెలకొనగా, ద్విచక్ర వాహనదారులు జారి పడే ప్రమాదం కూడా పొంచి ఉందని అంటున్నారు.

**చర్యలు ఎప్పుడూ?**
ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ డ్రైనేజీ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టి, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి మాటల్లో కాకుండా ప్రజల దైనందిన జీవితంలో కనిపించాలని, ఇలాంటి సమస్యల పరిష్కారంలోనే పాలనపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.



## వరద ప్రవాహానికి అడ్డంగా మట్టి

- **మునుగుతున్న రైతుల పొలాలు**
- **వరద ప్రవాహాన్ని దారి మళ్లించిన బడాబాబులు**
- **హిమాయత్ సాగర్ బఫర్ జోన్ లో భారీ నిర్మాణాలు**
- **నీటి కుంటల మారిన రైతు పొలం**
- **చర్యలు తీసుకోవాలి - స్థానిక రైతు గూడెపు లక్ష్మణ్ రావు**

**శంషాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**
మా పొలం నా ఇష్టం అన్న రీతిలో కొంతమంది ఇష్టానుసారం వ్యవహరిస్తూ తమ పొలంలో మట్టి పోసి నింపడంతో కొంతమంది రైతుల పొలాలు మూట మునిగి కుంటల్లా మారిపోతున్నాయి. సహజ సిద్ధమైన వరద ప్రవాహాన్ని అడ్డుకునే అధికారం ఎవరికి లేకపోయినప్పటికీ ఇష్టారాజ్యంగా మట్టి పోసి ఇతరు రైతులకు ఇబ్బంది పెట్టడం జరిగింది. దీంతో ఆ రైతు కులం వ్యవసాయానికి పనికి రాకుండా కుంటలాగా మారింది. శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ రెవెన్యూలో సర్వేనెంబర్ 389, 390 లలో జయప్రకాష్ తోట్ల అనే వ్యక్తి పెద్ద ఎత్తున మట్టి తెచ్చి పోసి పెంచారు. దీంతో ఉపరితలంలో ఉన్న సర్వే నెంబర్ 394లో అవుసుల పరమేశ్వర్ కు చెందిన భూమి నీట మునిగింది. స్థానిక రైతు గూడెపు వెంకట లక్ష్మణ్ రావు సోమవారం మాట్లాడుతూ ఈ రైతుల భూములు నర్కూడ రెవెన్యూ పరిధిలో హిమాయత్ సాగర్ బఫర్ జోన్ లో ఉంటుందని తెలిపారు. ఈ రైతుల పొలాల మీదుగా వరద ప్రవాహ నీరు సాగర్ లో కలవడానికి మార్గం పై భాగంలో ఉండేది. అక్కడ 111 జీవో ,హిమాయత్ సాగర్ బఫర్ జోన్ నిబంధనలు ఉల్లంఘించి బడా బాబులు భారీ ఎత్తున అక్రమ విల్లాలు నిర్మించారు. పర్వీన్ అలీ బేగ్ అనే వ్యక్తి తన విల్లాను నిర్మించినప్పుడు వరద ప్రవాహాన్ని దారి మళ్లించడం కోసం మట్టి పోసి నింపేశారు. ఈ కారణంగా గత కొన్ని సంవత్సరాలుగా వరద నీరు రైతుల పొలాల మీదుగా ప్రవహిస్తున్నది. ఇటీవల జయప్రకాష్ తోట్ల అనే వ్యక్తి తన పొలంలో మట్టిపోసి నింపడంతో ఉపరితల రైతు పొలం కుంటలాగా మారింది. కింది భాగంలో ఉన్న రైతులు ఇబ్బంది పడుతున్నారు. మట్టి పోసి నింపేటప్పుడు పక్కనున్న రైతుల పరిస్థితిని ఏమాత్రం లెక్క చేయకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. అధికారులు ఇప్పటికైనా రైతుల పొలాలు నీటిలో మునగకుండా పోసిన మట్టిని తొలగించాలి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఈ విషయంపై సంబంధిత ఫిర్యాదు చేస్తామని తెలిపారు.






## కేర్ గివింగ్ వాలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- **పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు**

**పెద్దేముల్, జూలై 13(ప్రజాక్షేత్రం):**
పెద్దేముల్ మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సి) పరిధిలోని "భవిత సెంటర్" లో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ లో కేర్ గివింగ్ వాలంటీర్ పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక మహిళలై ఉండాలని,వారి వయస్సు 22 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 15, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను



పెద్దేముల్ మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయంలో నేరుగా సమర్పించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో మండల తహసీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాధికారి సభ్యులుగా పాల్గొంటారని తెలిపారు. అర్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి నర్సింగ్ రావు విజ్ఞప్తి చేశారు.

## ఈశ్వరమ్మ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జక్కిడి శివచరణ్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- **వీరమళ్ళ కార్తీక్ గౌడ్**

**సంస్థాన్ నారాయణపురం జులై 13(ప్రజాక్షేత్రం):**
సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వీరమళ్ళ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ, యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమితులైన బీసీ బిడ్డ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ గారిపై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీసీ మహిళను అవమానించేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని, వెంటనే ఈశ్వరమ్మ యాదవ్, యాదవ జాతికి, బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, అవసరమైతే జక్కిడి శివచరణ్ రెడ్డి నివాసాన్ని ముట్టడించి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి వ్యాఖ్యలనైనా సహించబోమని, బీసీ సమాజం ఐక్యంగా తగిన సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులు కొప్పు రామకృష్ణ, నియోజవర్గ నాయకులు కట్కూరి శ్రీకాంత్, బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొల్లూరు నవీన్, కిషోర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ నమోదు చేసుకోకుంటే బోనస్ రాదు

- **ఎంఏఓ అనూరాధ**

**మొయినాబాద్, జూలై 13 (ప్రజాక్షేత్రం)**



ప్రభుత్వం ప్రకటించిన సన్న వరి రకాలకు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని మోయినాబాద్ మండల వ్యవసాయ అధికారి పి.అనూరాధ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా సందర్శించిన ఆమె, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఏఓ అనూరాధ మాట్లాడుతూ.. సన్న వరి సాగు చేసే రైతులకు అదనపు ఆదాయం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోంది. ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల వరి వేసిన రైతులు మాత్రమే ఈ బోనస్‌కు అర్హులు. రైతులందరూ తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల వద్దకు వెళ్లి వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## శిఖం భూమిలో పనులు ఆపాలంటూ అధికారులకు ఫిర్యాదు

- **చెరువు శిఖంలో భవన నిర్మాణంపై అభ్యంతరం**
- **ఇరిగేషన్ అధికారులతో పాటు ఇతర అధికారులకు గ్రామస్థుడి ఫిర్యాదు**
- **ఎస్‌హెచ్‌జీ భవన పనులు నిలిపివేయాలని విజ్ఞప్తి**
- **అధికారులు విచారణ చేపట్టాలని వినతి**

**పెద్దేముల్,జూలై 13 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామ శివారులోని ఊర చెరువు శిఖం భూమిలో చేపడుతున్న స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) భవన నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ గ్రామానికి చెందిన వడ్ల తిప్పన్న చారి గాజీపూర్ గ్రామ నాయకులతో కలిసి ఇరిగేషన్ శాఖ తాండూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.అంతకు ముందు సోమవారం ప్రజావాణిలో,తాండూరు ఆర్డీఓకు, పెద్దేముల్ మండల తహసీల్దార్‌లకు కూడా వినతి పత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో వడ్ల తిప్పన్న చారి తెలిపిన వివరాల ప్రకారం పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలోని ఊర చెరువు శిఖం భూమిలో సుమారు 20 సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (సబ్‌సెంటర్) భవనం నిర్మించేందుకు పిల్లర్ల వరకు పనులు చేపట్టగా, అది చెరువు శిఖం భూమి కావడంతో అధికారులు పనులను నిలిపివేసి నిర్మాణాన్ని తొలగించారని తెలిపారు. ప్రస్తుతం అదే స్థలంలో గాజీపూర్ గ్రామ సర్పంచ్ భర్త అధికారాన్ని ఉపయోగించి ఎస్‌హెచ్‌జీ భవన నిర్మాణాన్ని చేపడుతున్నారని ఆరోపించారు.

చెరువు శిఖం భూమిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలకు అనుమతి ఉండదని, గతంలో సబ్‌సెంటర్ పనులు నిలిపివేసిన విధంగానే ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌హెచ్‌జీ భవన నిర్మాణాన్ని కూడా వెంటనే నిలిపివేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ వినతిపత్రం ప్రతులను పెద్దేముల్ తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ), తాండూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) లకు కూడా పంపినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గాజీపూర్ మాజీ ఎంపీటీసీ తిప్పన్న చారి, మాజీ సర్పంచ్ తలారి వీరప్ప,సీనియర్ నాయకులు సాయిలు గౌడ్, వీరేందర్ చారి, ఉస్మాన్ చాంద్ పాషా,ముస్తఫా,వెంకట్ గౌడ్, తదితరులు ఉన్నారు.



## వలిగొండ మోడల్ స్కూల్లో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

**వలిగొండ జులై 13(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోతుకుంటలోని బాలికల మోడల్ స్కూల్ హాస్టల్ను ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ సౌకర్యాలు, నిత్యావసర నిల్వలు, వంటగది పరిశుభ్రతను ఆయన పరిశీలించారు.

విద్యార్థినులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసి, ఏవైనా సమస్యలుంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ అనిత. ప్రధానోపాధ్యాయురాలు రాయి సున్నీసా బేగం. తదితరులు పాల్గొన్నారు.



# వనపర్తిలో రూ.359 కోట్ల హ్యామ్ రహదారుల పనులకు శ్రీకారం

- **ఉమ్మడి పాలమూరును అద్దంలాంటి రహదారులతో తీర్చిదిద్దుతాం**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**
- **171.96 కి.మీ. మేర రహదారుల అభివృద్ధి..**
- **రాజీవ్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రస్తావన**

**వనపర్తి, జూలై 13(ప్రజాక్షేత్రం):**





ఉమ్మడి పాలమూరు జిల్లాలో రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పాలమూరు ఇక వెనుకబడిన ప్రాంతం కాదని, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలతో అభివృద్ధి బాటలో వేగంగా దూసుకుపోతోందని పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో రూ.359.09 కోట్లతో చేపట్టనున్న 171.96 కిలోమీటర్ల హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) రహదారి అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. హ్యామ్ విధానంతో వేగంగా రహదారుల నిర్మాణం

హైబ్రిడ్ అన్యుటీ మోడల్‌లో ప్రభుత్వం-ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యంగా రహదారులను నిర్మిస్తాయని మంత్రి వివరించారు. ఈ విధానంలో ఆర్థిక భారం పంచుకోవడంతో పాటు నాణ్యమైన మౌలిక సదుపాయాల నిర్మాణం వేగంగా పూర్తయ్యే అవకాశముంటుందని చెప్పారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా ఆత్మకూరు రహదారి బలోపేతం, బుద్ధారం -జడ్చర్ల రహదారి విస్తరణ, పెద్దదగడ-వెలగొండ (గూడెం, బెక్కెం, మియాపూర్ మీదుగా) రహదారి రెండు లేన్లుగా అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు. మొత్తం 171.96 కి.మీ. పొడవున రహదారులను అభివృద్ధి చేయనున్నారు. 2028 నాటికి అద్దంలాంటి రహదారులు

శంకుస్థాపన అనంతరం వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.3,000 కోట్ల వరకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కురుమూర్తి స్వామి దేవాలయానికి అత్యుత్తమ రహదారులను మంజూరు చేశామని, 2028 నాటికి ఉమ్మడి పాలమూరు జిల్లాను అద్దంలాంటి రహదారులతో తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

సంక్షేమం-అభివృద్ధి రెండింటికీ ప్రాధాన్యం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రుణమాఫీ, సన్నబియ్యం, ఆరు గ్యారంటీల అమలును ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తోందన్నారు. వనపర్తి జిల్లాలో రూ.359.09 కోట్లతో రహదారుల అభివృద్ధి చేపట్టడం అభివృద్ధికి నిదర్శనమన్నారు.

వనపర్తికి మరిన్ని నిధులు కావాలి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రూ.359.09 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన జరగడం సంతోషకరమన్నారు. ఇప్పటికే ఐటీ టవర్, రూ.275 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చామని చెప్పారు. జిల్లాకు రూ.2 వేల కోట్లకు పైగా నిధులు సాధించామని, మరో రూ.124 కోట్లు మంజూరు చేస్తే వనపర్తిలోని ప్రధాన రహదారులన్నింటినీ డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయవచ్చని మంత్రి కోమటిరెడ్డిని కోరారు.

**అభివృద్ధి వేగం మరింత పెరుగుతుంది**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు చేసిన త్యాగాలను గుర్తు చేశారు. హ్యామ్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన రహదారి పనులు త్వరగా పూర్తవుతాయని, కురుమూర్తి ఆలయ రహదారుల అభివృద్ధిని కూడా వేగవంతం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో హ్యామ్ ప్రాజెక్టు అమలుకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని కోరారు. పాల్గొన్న అధికారులు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం

- **నిత్యవసర సరుకులు, ఆర్థికంగా సాయం అందజేత.**
- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్వ మహిపాల్ యాదవ్.**

**యాలాల జూలై 13(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలం పరిధిలోని దేవనూరు గ్రామంలో ఇటీవల కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా దెబ్బతిన్న ఇంటిని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయాన్ని, అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కి ఈ విషయాన్ని తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వారి తక్షణమే స్పందించి బాధ్యత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా అందించారన్నారు. మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద సంభవించిన స్థానిక ఎమ్మెల్యే ముందుండి వారిని ఆదుకుంటారన్నారు. బాధిత కుటుంబాలు ఎవరు కూడా ఆధర్య పడవద్దని, మన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ల అధ్యక్షులు ఉప్పరి వెంకటయ్య, నాయకులు సుధాకర్ రెడ్డి, కాఖీం, వడ్ల శ్రీనివాస్, రవికుమార్, హన్మ నాయక్, మల్లేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఆహార నాణ్యతపై రాజీ పడితే కఠిన చర్యలు

**నిర్మల్ జిల్లా జూలై 13(ప్రజాక్షేత్రం):**

భైంసా పట్టణ ప్రజల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా మున్సిపల్ యంత్రాంగం కదిలింది. భైంసా పట్టణంలోని పలు బేకరీలు, స్వీట్ స్టాల్లు, హోటళ్లలో సోమవారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో ఆహార పదార్థాల నాణ్యతపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో స్పందించిన అధికారులు, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ మెరుపు దాడులు చేపట్టారు. వ్యాపార కేంద్రాలలో ఆహార పదార్థాల తయారీ విధానాన్ని, నిల్వ ఉంచిన ప్రాంతాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. లేదుతనిఖీల్లో భాగంగా పలు బేకరీలలో కిచెన్ ఏరియా, తినుబండారాల నిల్వ గదులు అపరిశుభ్రంగా ఉండటంపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హోటళ్లు, బేకరీల నిర్వాహకులు తప్పనిసరిగా అంతర్గత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. లాభార్జనే ధ్యేయంగా కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాపారాలు నిర్వహించాలని హితవు పలికారు.






## వలిగొండలో ఘనంగా దుర్గాభవాని హీరో షోరూం ప్రారంభం

**వలిగొండ జూలై 13(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో సోమవారం దుర్గాభవాని హీరో షోరూంను సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి ప్రారంభించారు. యజమానులు వలందాసు సతీష్‌గౌడ్, స్వాతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిస్ట్రిబ్యూటర్ గట్టు రాంమోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, ఇతర రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. నూతన షోరూం ప్రారంభంతో స్థానికులకు మెరుగైన వాహన సేవలు అందుబాటులోకి వచ్చాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్కింగ్‌లో పెట్టిన బైక్‌లే టార్గెట్.. పేట్‌బషీరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్

- **సీసీటీవీ ఉచ్చులో బైక్ దొంగలు..19 కేసుల మిస్టరీ వీడింది**

**కుత్బుల్లాపూర్, జూలై 13(ప్రజాక్షేత్రం):**



నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలకు చెక్ పెట్టేలా పేట్‌బషీరాబాద్ పోలీసులు అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పట్టుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పక్కా ప్రణాళికతో బైక్‌లను అపహరిస్తూ పోలీసులకు సవాల్ విసిరిన ముఠాను సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారంతో గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

పోలీసుల కథనం ప్రకారం... మైసమ్మగూడ అపారెల్ పార్క్ సమీపంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన బృందాలు నిందితులను పట్టుకున్నాయి. విచారణలో నిందితులు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు వాహన చోరీ కేసులతో పాటు మొత్తం 19 కేసుల్లో తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 21 మోటార్ సైకిళ్లు, ఒక సుజుకి ఎర్టిగా కారు, మూడు మొబైల్ ఫోన్లు, రెండు మాస్టర్ కీలు, స్క్రూడ్రైవర్లు, కట్టర్లు తదితర చోరీ పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో బౌరి అశోక్ సింగ్, అయల్పురం రఘుపతి అలియాస్ రఘు, బండి ప్రణీత్ అలియాస్ సోను ఉన్నారు. వీరిపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. చైతన్య అలియాస్ సన్నీ, సురేష్ పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

ఈ ముఠా కారులో సంచరిస్తూ పార్కింగ్ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా ఉంచిన బైక్‌లను లక్ష్యంగా చేసుకుని మాస్టర్ కీలు, ప్రత్యేక పరికరాలతో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వరుస చోరీలతో ప్రజల్లో ఆందోళన నెలకొన్న వేళ, నిందితులను అరెస్టు చేసి కేసులను ఛేదించడం పోలీసులకు కీలక విజయంగా నిలిచింది. కుత్బుల్లాపూర్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం మార్గదర్శకత్వంలో, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో కేసులను ఛేదించిన ప్రత్యేక పోలీసు బృందాన్ని కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి అభినందించారు. వీరితోపాటు పెట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, డిఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంట్లో ఉరేసుకుని తనువు చాలించిన బోరిగాం సర్పంచ్ పల్లె జ్యోతి

**నిర్మల్ జిల్లా జూలై 13(ప్రజాక్షేత్రం):**



తానూర్ మండలం బోరిగాం గ్రామంలో సోమవారం ఒక తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్ పల్లె జ్యోతి (మృతురాలు) తన నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికంగా ఎంతో క్రియాశీలకంగా ఉంటూ, ప్రజాసేవలో ఉన్న సర్పంచ్ ఇలా హఠాత్తుగా బలవన్మరణానికి శరణు కోరడం మండలవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని, విషాదాన్ని నింపింది.నిశ్చేష్టంగా మారిన కుటుంబ సభ్యులుపోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రోజున జ్యోతి తన ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. కొంతసమయం తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఒక్కసారిగా జరిగిన ఈ ఘోరంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# భయపడకండి అండగా మేముంటాం : పట్నం మహేందర్ రెడ్డి

- **నిందితునికి అండగా నిలిచిన పోలీసులపై చర్యలు తీసుకుంటాం : కలెక్టర్ నారాయణరెడ్డి**
- **మేఘనకు అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే యాదయ్య**
- **మేఘనకు రూ. 10 లక్షల చెక్కును అందించిన మహేందర్ రెడ్డి, యాదయ్య, కలెక్టర్ నారాయణ రెడ్డి**

**షాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**

షాబాద్ లో రాజ్ కుమార్ హత్యాకాండ బాధితుల ఇంటిని మరోసారి సందర్శించి బాధితులతో మాట్లాడిన శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి బాధిత కుటుంబ దివ్యాంగురాలు మేఘనకు ప్రభుత్వం తరఫున రూపాయలు 10 లక్షల చెక్కును అందించిన చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంఎల్ఏ యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి. మేఘన పరిస్థితి తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని రూపాయలు ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంచారని వారు వివరించారు. అలాగే ఇందిరమ్మ ఇల్లుతో పాటు మేఘనకు మానసిక వికాసం కోసం మూడు ప్రభుత్వ పునరావాస కేంద్రాలను పరిశీలించామని ఇందులో సికింద్రాబాద్ పునరావాస కేంద్రం బాగుందని అందులో చేర్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, మేనమామ నరేష్ తదితరులు నిందితునికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఇది ఎక్కడ విచిత్రమైన పరిస్థితి అని వారు ప్రశ్నించారు. పోలీస్ పెట్రోలింగ్ లేనందు వల్లే అఘాయిత్యం జరిగిందని ఫిర్యాదు చేశారు.

తాము కుటుంబాన్ని కోల్పోయామని మేఘన అనాధగా మిగిలిపోయిందని వారు వాపోయారు. కేసులో నిందితునికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే యాదయ్యలు పెట్రోలింగ్ వ్యవస్థను పెంచుతున్నట్లు ప్రకటించారు. నిందితునికి సహకరించినట్లు విచారణలో తేలితే చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయని వారు బాధితులకు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం మేఘనకు జీవిత కాలం వరకు ప్రభుత్వం అవసరమైన సదుపాయాలను కల్పిస్తుందని వెల్లడించారు. మేఘన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయినందున ఆయనకు రావలసిన పెన్షన్ మేఘనకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను ఆదేశిస్తామని వెల్లడించారు. అలాగే ఇతర విషయాలకు సంబంధం లేకుండా దివ్యాంగురాలు అయిన మేఘనకు వికలాంగుల పెన్షన్ సైతం యధావిధిగా వస్తుందని వెల్లడించారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ఘటన దురదృష్టకరమని, బాధాకరమని పేర్కొంటూ మేఘన కుటుంబానికి తాము ఎల్లవేళలా అండగా నిలుస్తామని వివరించారు. పోలీసుల వైఫల్యం లేకుండా ఇకపై పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేసేలా ఆదేశిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి అందాల్సినవి అన్నీ అందిస్తామని వెల్లడించారు. మేఘనకు పునరావాస కేంద్రంలో వైద్యం మానసిక వికాసం తదితరాలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రస్తుతం రూ. 10 లక్షల పరిహారం అందించామని అవసరమైతే మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పాల్గొన్నారు తరుణ్ జోషి, అడిషనల్ డిసిపి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ సర్పంచ్ అశోక్ ఉపసర్పంచ్ రాహుల్ మాజీ సర్పంచ్ తమ్మలి రవి తదితరులు పాల్గొన్నారు.



# ఓటు హక్కును కాపాడుకోవాలి

- **గడ్డం శేఖర్ యాదవ్.**

**శంషాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామ్యులై ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును కాపాడుకోవాలని నర్ఖూడ గ్రామపంచాయతీ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన నర్ఖూడ గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పై గ్రామ ప్రజలకు, మహిళలకు, మహిళా మండలి గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేవిధంగా ప్రతి ప్రతిరోజు ప్రజల మధ్యలో ఉండి వారి ఓటు హక్కు కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీకు సహాయం అందించేందుకు బి ఎల్ ఓ లు, గ్రామ పంచాయతీ సెక్రటరీ, గ్రామపంచాయతీ పాలకవర్గం, ఎస్ ఐ ఆర్ కు సంబంధించిన స్టాఫ్, గ్రామపంచాయతీ స్టాఫ్ అందుబాటులో ఉంటారని తెలిపారు.



# విద్యుత్ సమస్యను పరిష్కరించుటకు తగు చర్యలు

- **గడ్డం ప్రసాద్ కుమార్**

**వికారాబాద్ జూలై 13(ప్రజాక్షేత్రం):**

విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా, మర్పల్లి మండలం పట్లూర్ గ్రామ పరిధిలో 33/11 కెవి సబ్ స్టేషన్ కు శంకుస్థాపన, మర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, ఇందిరమ్మ ఇంటిని సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభోత్సవం గావించారు. ఈ సందర్భంగా సభాపతి గడ్డ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్య లేకుండా అవసరమున్న ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పట్లూరు సబ్ స్టేషన్ ఏర్పాటుకు 3 కోట్ల 04 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల చుట్టుపక్క గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఉండదని ఆయన తెలిపారు. అదేవిధంగా మర్పల్లి మండల కేంద్రంలో 25 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సభాపతి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఉప కేంద్రాన్ని అందుబాటులోకి తేవడం జరిగిందని ఆయన తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని అదేవిధంగా ఎప్పుడు మందులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సభాపతి బిపి చెక్ చేసుకున్నారు. అదేవిధంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అనంతరం మర్పల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి దంపతులకు నూతన వస్త్రాలను సభాపతి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ డీఈ సంజీవ్, డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, పట్లూరు, మర్పల్లి సర్పంచులు బనావత్ పరశురాం, మాడుగు రామేశ్వర్, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ శాంత, పట్లూరు వైద్యాధికారి వివిఎస్ మానస హర్ష, వివిధ గ్రామాల సర్పంచ్ లు సంజీవరెడ్డి, చుక్కా రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, ఆనంద్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలి

- **కే.కే.కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతిపత్రం అందజేసిన మంచర్ల శ్రీనివాస్.**

**శంషాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని కే.కే.కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతిపత్రం అందజేసిన మంచర్ల శ్రీనివాస్ శంషాబాద్ మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఉద్యమకారుడు మంచర్ల శ్రీనివాస్ కే.కే. కమిటీ సభ్యుడు కోదండరాంకు వినతిపత్రం అందజేశారు.హైదరాబాద్‌లోని అమరజ్యోతి కార్యాలయంలో కే.కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో సంవత్సరాలు ఉద్యమకారులు తమ సమయం, శ్రమ, జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. రాష్ట్రం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఇప్పటికీ ప్రభుత్వ గుర్తింపు, సంక్షేమ ఫలితాలకు దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ మండలంలోని ఉద్యమకారులందరినీ గుర్తించి, ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోదండరాంను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నగండు రాజేందర్, సాలివేంద్రి వెంకట్ రెడ్డి, వీరమల్ల హన్మంత్ ముదిరాజ్, ఆర్.కే.తో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.





# పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా

- **పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రభుత్వం**
- **67 మంది లబ్ధిదారులకు రూ.67.07 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**
- **అర్హత గల ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**పెద్దేముల్, జూలై 13(ప్రజాక్షేత్రం):**

పేదింటి ఆడపడుచుల వివాహాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో పెద్దేముల్ మండలానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.67,07,772 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ...ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించడమే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పాలనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, ఎస్ఐఆర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తట్టేపల్లి నారాయణ గౌడ్,స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, మండల, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# కొత్త కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి..

- **కలెక్టర్ చిత్రా మిశ్రా**
- **పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**కరీంనగర్, జూలై 13(ప్రజా-క్షేత్రం):**




కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం రాత్రి పరిశీలించారు. ఇంకా మిగిలి ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, కలెక్టరేట్‌ను అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్మించిన హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్.. దాని పరిసరాల్లో విస్తృతంగా పచ్చదనం పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. నీటి సరఫరా, డ్రైనేజీ, విద్యుత్, లైటింగ్, సానిటేషన్ వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన గేట్ల నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాత కలెక్టరేట్ భవనానికి అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూతన కలెక్టరేట్‌ను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సిద్ధం చేయాలని సూచించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహాచారి, తహసీల్దార్లు సుధాకర్, రాజేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బిహార్‌లో మొబైల్ దొంగకు చేదు అనుభవం

**హైదరాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**

బిహార్‌లో మొబైల్ దొంగకు చేదు అనుభవం ఎదురైంది. బిహార్‌లోని ఖగారియా జిల్లా మాన్సి రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న జనహిత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడి మొబైల్ లాక్కునేందుకు దొంగ ప్రయత్నించగా అప్రమత్తమైన ప్రయాణికులు అతడి చేతిని గట్టిగా పట్టుకున్నారు. అంతలోనే రైలు స్టేషన్ నుంచి కదలడం ప్రారంభించింది. దీంలో దొంగ రైలు బయటే వేలాడుతూ సుమారు 9 కిలోమీటర్ల పాటు ప్రయాణించాడు. ఖగారియా స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి దొంగను తీసుకున్నారు. నిందితుడు బర్కత్ మన్సూరీగా పోలీసులు గుర్తించారు. గతంలో కూడా మొబైల్ స్నాచింగ్, చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటన ప్ర



స్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుంది.




## గోపులారంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం..

- **మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం**

**శంకర్ పల్లి జులై 13(ప్రజాక్షేత్రం):**

గోపులారం గ్రామ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోపులారం గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ తంగడిపల్లి రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ నర్సనోళ్ల జయంత్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం సహకారంతో మహిళలకు కొత్త కుట్టు మిషన్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ నర్సనోళ్ల జయంత్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సాంకేతిక శిక్షణ కేంద్రాలను గ్రామంలో ఏర్పాటు చేసి గోపులారాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే శిక్షణ పొందుతున్న 30 మందికి పైగా మహిళలకు మిషన్ కత్తెర్లు బహుమతిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్ వార్డు సభ్యులు నర్సనోళ్ల దయాకర్, సారా లావణ్య అక్షయ్, బేగారి వినోద్ నర్సింలు, తొండ కల్పన గొట్టయ్య, పొడువు మనీషా నవీన్, మాజీ వార్డు సభ్యుడు పూజారి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి అమృత, ఉపాధ్యాయుడు సాయిబాబా, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# కాంగ్రెసోళ్లను ప్రజలు ఉరికించి కొడతారు

- **కేసీఆర్ బయటకు వచ్చి నిజాలు చెబితే వీళ్లకు విలువుండదు**
- **తెలంగాణ రైతాంగానికి నీళ్లందించేందుకు కాళేశ్వరం సిద్ధంగా ఉంది**
- **ఇప్పటికైనా పంపులు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వండి**
- **ఎల్ఎండీతో పాటు 9 నియోజకవర్గాలకు తాగునీటి ముప్పు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **కరీంనగర్ దిగువ మానేరు జలాశయాన్ని సందర్శించిన కేటీఆర్**



**కరీంనగర్, జూలై 13(ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కసారి ప్రజల ముందుకు వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న వాస్తవాలను చెబితే, కాంగ్రెస్ నాయకులను ప్రజలే నిలదీస్తారని ఆయన వ్యాఖ్యానించారు. కరీంనగర్ లోని దిగువ మానేరు (ఎల్ఎండీ) జలాశయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన మాజీ ఇంజనీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. తెలంగాణ కోసం పనిచేసిన వ్యక్తిని కాళేశ్వరం అవినీతి కేసుతో అనుసంధానం చేస్తూ జైలుకు పంపిస్తామని బెదిరించడం దురదృష్టకరమన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వకుండా రాజకీయ విమర్శలతో కాలం గడపడం సరికాదని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లు, బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, కాలువలు, మోటార్లు, సబ్‌స్టేషన్లు అన్నీ సక్రమంగానే ఉన్నాయని, ఒక్క ప్రభుత్వం సంకల్పంతో పంపులు ఆన్ చేస్తే రైతులకు వెంటనే సాగునీరు అందుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పంపులు ప్రారంభించి రైతులకు నీళ్లు ఇస్తే, ఆయనపై రాజకీయ విమర్శలు కూడా చేయబోమని స్పష్టం చేశారు. కేసీఆర్ ఒక్క మాట చెబితే బీఆర్ఎస్ కార్యకర్తలే వెళ్లి పంపులు ఆన్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని, అయితే ఆయన సంయమనం పాటించాలని సూచించారని వెల్లడించారు. తీవ్ర తాగునీటి సంక్షేమ ప్రమాదం ప్రస్తుతం గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో 20 శాతం కంటే తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు సుమారు 9 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తున్నా, ప్రభుత్వం వాటిని వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా ఎల్ఎండీ జలాశయం నీటి కోసం ఎదురు చూస్తోందని, వెంటనే కాళేశ్వరం పంపులను నడపకపోతే కరీంనగర్‌తో పాటు ఎల్ఎండీపై ఆధారపడిన తొమ్మిది నియోజకవర్గాల్లో తీవ్ర తాగునీటి సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షలు పక్కనపెట్టి, వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసి రైతులకు, ప్రజలకు అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## పొలాల్లోకి తరలించొద్దు.. సిద్దాపూర్ గ్రామస్తులు ఆవేదన

- **జాతీయ రహదారిపై ధర్నా.**

**కొత్తూరు జులై 13(ప్రజాక్షేత్రం):**

జీవో నంబర్ 641 ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పరిధిలోని సిద్దాపూర్, కొడిచర్ల, పలు తాండలా గ్రామస్తులు వందలాదిగా జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. దీంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సిద్ధపూర్ గ్రామ పరిధిలో పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన డంపు యార్డు వ్యతిరేక జేఏసీ ఆధ్వర్యంలో సమావేశమై అక్కడినుండి నేరుగా జాతీయ రహదారిపైకి వందలాది మంది చేరుకొని రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

కాలుష్య కారకమైన చెత్త డంపింగ్ యార్డ్ సిద్దాపూర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 641 రద్దు చేసే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. డంపుయార్డు వల్ల పచ్చని పంట పొలాలు, నీళ్లు కాలుష్యం అవుతాయని, పంటలే జీవనదారంగా బ్రతికే తమకు బ్రతుకు భారం అవుతుందని రైతులు అన్నారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులను, రైతులను పోలీసులు స్టేషన్ కు తరలించారు.



## ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు...

- **అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణ.**

**ప్రజాక్షేత్రం, వర్గల్ జులై 13**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం వర్గల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశా వర్కర్ దుర్గా ఆధ్వర్యంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం తిరుపతమ్మ మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా ఈ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మంజుల,అంగన్‌వాడీ హెల్పర్ విజయ తదితరులు పాల్గొన్నారు



## ఆరేళ్ల మనవరాలితో డ్రైవింగ్...ఎస్ఐ సస్పెండ్

**హైదరాబాద్ జులై 13(ప్రజాక్షేత్రం):**

ఆరేళ్ల మనవరాలికి డ్రైవింగ్ పాఠాలు నేర్పిన ఎస్సైపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటువేశారు.నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ఓ ఎస్సై ఆరేళ్ల వయసున్న తన మనవరాలికి కారు నేర్పిస్తుండగా స్థానికులు అడ్డుకున్న ఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధి గంధంగూడలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తన కారు(టీఎస్07 జీపీ7450)ను మనవరాలికి ఇచ్చిన ఎస్సైపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా పనిచేస్తున్న పూజారి తిరుపతి తన మనవరాలికి గంధంగూడ రోడ్డులో కారు డ్రైవింగ్ నేర్పిస్తుండగా.. మార్గంలో వెళుతున్న వారు అడ్డుకుని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని నిలదీశారు. కొందరు ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దంటూ ప్రచారం చేసే పోలీసులే నిబంధనలకు విరుద్ధంగా చిన్నపిల్లలకు కారు ఇవ్వడమేంటని పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై డిజిపి సివి ఆనంద్ స్పందించారు. ఆ ఎస్సైని సస్పెండ్ చేసి శాఖ పరమైన విచారణ చేపట్టాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సంఘటనపై రవాణా శాఖ తీవ్రంగా స్పందించింది. మైనర్లతో వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. మైనర్ వాహనం నడుపుతూ పట్టుబడటంతో మోటార్ వెహికిల్ చట్టంలోని సెక్షన్ 199ఏ(4) ప్రకారం సంబంధిత వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాదిపాటు రద్దు చేసినట్లుగా ప్రకటించింది.



## విద్యుత్ స్తంభాలు వేసి తీగలను మరిచిన విద్యుత్ శాఖ అధికారులు.

- **విద్యుత్ శాఖ తీరుపై మండిపడుతున్న గ్రామస్తులు.**

**కామారెడ్డి జిల్లా జులై 13(ప్రజాక్షేత్రం):**



సదాశివ నగర్ మండల్ భూంపల్లి గ్రామంలో ఏడో వార్డులో విద్యుత్ స్తంభాలు వేసి తీగలను మరిచిన విద్యుత్ శాఖ అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్య రాకుండా చూడాలని ఆదేశించిన కానీ కొందరు విద్యుత్ అధికారులు తీరు మార్చుకోవడం లేదు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నాయి సరి చేయాలి కానీ విద్యుత్ అధికారులు దానికి విరుద్ధంగా ఉన్నారని చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని మూడు సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు గ్రామంలో ఏర్పాటు చేసిన దానికి తీగలు మాత్రం అమర్చడం లేదు విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను మార్చాలని గ్రామస్తులు వేడుక గ్రామాలలో వ్యవసాయ క్షేత్రం వద్ద విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ కనబడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ తీగలు అమర్చకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు లైన్మెన్ ఏఈ. ఏఏఈ. ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలను అమర్చే విధంగా కృషి చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఏడో వార్డులో విద్యుత్ స్తంభాలు మూడు సంవత్సరాలుగా. క్రితం వేసి విద్యుత్ తీగలను అమర్చకపోవడం అప్పుడున్న లైన్మెన్ ఏఈ నిర్లక్ష్యమే అని గ్రామస్తులు అంటున్నారు ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించి ఏడవో వార్డులో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగల మార్చాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి జోలికి వస్తే ఖబడ్దార్....

- **ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక**
- **నర్సారెడ్డితోనే పార్టీ అభివద్ధి సాధ్యం**

**తూప్రాన్ జులై 13 ప్రజాక్షేత్రం**

కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిషలు కషి చేస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై నిరాధారమైనటువంటి నిందలు వేయడం, అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు నాచారం దేవాలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా మండిపడ్డారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి మండలంలో పార్టీ కోసం పని చేసే నాయకులను గుర్తించి నాయకులను తీర్చిదిద్ధిన ఘనత నర్సారెడ్డికే దక్కుతుందన్నారు. నర్సారెడ్డితో పార్టీఓ ఎదిగి నేడు ఆయనపైనే విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ నాయకులకు పదవులు అమ్ముకునే అవసరం నర్సారెడ్డికి లేదని, పదవులు దక్కకపోవడంతోనే అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఒకే పార్టీలో ఉంటూ గ్రూపులుగా ఏర్పడ వద్దని, కలిసి పార్టీని బలోపేతం చేయాలని రవీందర్ గుప్త పేర్కొన్నారు. అనుభవం లేని వ్యక్తికి పార్టీ పదవి ఎలా అప్పగిస్తారని అనుభవం కలిగిన భగవాన్‌రెడ్డిని మున్సిపల్ శాఖ అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మామిండ్ల కష్ణ, మండల పార్టీ అధ్యక్షులు జింక మల్లేష్, నాయిని ఆంజనేయులు గౌడ్ లక్ష్మినరసింహగౌడ్, పురం రవిందర్, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, చుక్క శ్రీశైలం, యంజాల స్వామి, మాణిక్యరావు, గోపాల్, బొడ్డు వేణు, నాగేష్, మన్నె భాను, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.





## తురుక కాశ సంక్షేమ సంఘం వర్గల్ మండల కమిటీ ఎన్నిక

**వర్గల్ జులై 13 (ప్రజాక్షేత్రం) :-**

తురుక కాశ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం ఆదేశాల మేరకు వర్గల్ మండల కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎండి మదర్, ఉపాధ్యక్షుడిగా ఎండి లక్కు, ప్రధాన కార్యదర్శిగా షేక్ గోరేమియా, సహాయక కార్యదర్శిగా ఎండి హదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు ఎండి మదర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కరీం, సయ్యద్ నగర్ మహమ్మద్ అఫ్సర్, షరీఫ్ మహబూబ్‌తో పాటు సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## మార్పునకు నాంది
# ఈ విజయం!



సమంత ప్రధాన పాత్రధారిగా రూపొందిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. భారతదేశంలోనే అత్యధిక వసూళ్లని సాధించిన మహిళా ప్రధానమైన చిత్రాల్లో 'మా ఇంటి బంగారం' ఆరో స్థానాన్ని దక్కించుకుందని సినీ వర్గాలు తెలిపాయి. నందినీరెడ్డి దర్శకత్వంలో సమంత ప్రధాన పాత్రధారిగా నటిస్తూనే, తన భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్‌రెడ్డి దువ్వూరుతో కలిసి నిర్మించిన చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైంది. హాస్యం, యాక్షన్ మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకుల మెప్పు పొందింది. రూ.100 కోట్ల మైలురాయిని చేరుకోవడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు సమంత. ''ఈ చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటున్నారా? మేం చేస్తున్న ప్రచారం వాళ్లకు చేరువవుతోందా? అసలు ఈ సినిమా అంటూ ఒకటి ఉందని వాళ్లకి తెలుసా? అని విడుదలకు ముందు తీవ్రంగా ఆలోచించడం నాకు బాగా గుర్తుంది. అప్పుడే నా స్నేహితుడు ఒక ప్రదర్శనకారుడికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సంభాషణని నేనూ వింటున్నానని అతనికి తెలియదు. ఈ సినిమా గురించి మీరేం అనుకుంటున్నారని అడగ్గానే ఏమాత్రం సంకోచించకుండా 'ఒక హీరోయిన్ సినిమాని ఎవరైనా ఎందుకు చూస్తారు? ఆమె ఒక పెద్ద హీరో సినిమాలో నటిస్తే పర్వాలేదు. ఎందుకంటే గ్లామర్ వల్లే ఆమె ప్రేక్షకులకు తెలుసు. కానీ ఒక నాయికా ప్రధానమైన పాత్రలో ఎవరు చూస్తారు?' అన్నారు. ఎవరైనా ఒక సాహసం చేయడానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుందని అనుకుంటున్నా. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు, అవి ఫలిస్తాయి. మా విషయంలోనూ అది ఫలించింది. ఇది గొప్ప మార్పునకు నాంది అవుతుందని ఆశిస్తున్నా. తదుపరి ఏ ప్రదర్శనకారుడికైనా ఫోన్ చేసి మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే సమాధానం వెంటనే 'కాదు...' అని రాకూడదని నేను ఆశిస్తున్నా'' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినిమా విజయోత్సాహంలో ఉన్న ఆమె త్వరలోనే పండంటి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. 'మా ఇంటి బంగారం' సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించడంపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.



ప్రస్తుతం 'లెనిన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే (Bhagyashri Borse). ఈ సినిమా సక్సెస్ అనంతరం ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. తన చిన్నతనంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. తాను ఒక సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చానని, ఇండస్ట్రీలో ఈ స్థాయికి చేరుకోవడం అంత సులువుగా జరగలేదని వెల్లడించారు. తాను పుట్టిన కొద్ది రోజులకే తండ్రి ఉద్యోగం కోల్పోవడంతో తమ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని భాగ్యశ్రీ తెలిపారు. కుటుంబ పోషణ కోసం తన తండ్రి పడిన కష్టాలను గుర్తుచేసుకున్నారు. ''మా నాన్న వేరొకరిని బతిమిలాడటం నేను చూశాను. 'దయచేసి నాకు ఏదైనా ఉద్యోగం ఇవ్వండి. నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు' అని ఆయన ఒకరి దగ్గర ప్రాధేయపడటం చూశాను'' అని ఆమె చెప్పారు. దీంతో కష్టపడి డబ్బు సంపాదించి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే బలమైన సంకల్పం తనలో ఏర్పడిందని ఆమె వివరించారు. ఇటీవల జరిగిన 'లెనిన్' సక్సెస్ మీట్‌లోనూ భాగ్యశ్రీ భావోద్వేగానికి గురైయ్యారు. ఈ స్థాయికి రావడానికి ఎంతో కష్టపడినట్లు తెలిపారు. తనను అభిమానులు ఎప్పుడూ ప్రోత్సహించారని కృతజ్ఞతలు తెలిపారు.

మహారాష్ట్రలో జన్మించిన భాగ్యశ్రీ బోర్సే.. 'చందు ఛాంపియన్', 'యారియాన్ 2' వంటి చిత్రాల్లో చిన్న పాత్రలతో తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత రవితేజతో 'మిస్టర్ బచ్చన్', విజయ్ దేవరకొండతో కలిసి 'కింగ్‌డమ్', రామ్ పోతినేనితో 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాల్లో నటించారు. దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన 'కాంత' సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టారు. తాజాగా 'లెనిన్'తో సక్సెస్ అందుకున్నారు.

**ఇద్దరు కుమార్తెలున్నారు..**
**ఉద్యోగమివ్వండని నాన్న ప్రాధేయపడ్డాడు**

# పేరుకే సుకుమారి



''సినిమాపై పెట్టే ప్రతి రూపాయికీ తగిన విలువని కోరుకుంటున్నారు ప్రేక్షకులు. అందుకే నిర్మాణ విలువల్లో రాజీపడకుండా సినిమాల్ని రూపొందిస్తుంటాం'' అన్నారు మహేశ్వర్ రెడ్డి మూలి. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'ఓ..! సుకుమారి'. తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటించారు. భరత్ దర్శన్ దర్శకుడు. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మూలి ఇటీవల హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... ''ఓ కొత్త కాన్సెప్ట్‌తో నిర్మించిన సినిమానే 'ఓ..! సుకుమారి'. కుటుంబ వినోదంతో కూడిన ఓ మంచి కథ ఇది. భావోద్వేగాలు, హాస్యం సమపాళ్లల్లో ఉంటాయి. ఇంటిల్లిపాదీ కలిసి చూసేలా ఉంటుంది. తెలంగాణలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరణ జరిపాం. దర్శకుడు కథ చెప్పాక ఏడాదిపాటు స్క్రిప్ట్‌పై పనిచేసి సినిమాని ప్రారంభించాం. ఈ కథకు తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ అయితేనే బాగుంటుందని వాళ్లని ఎంపిక చేసుకున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం తర్వాత ఆమె ఎంతో ఇష్టపడి చేసిన సినిమా ఇది. పేరుకే సుకుమారి కానీ, ఈ కథలో ముట్టుకుంటే చాలు... షాక్ కొట్టే ఓ కుమారి కనిపిస్తుంది. ఆమెని పెళ్లి చేసుకున్న ఓ యువకుడికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఆ అమ్మాయిలో ఉన్న సమస్యని ఇద్దరూ కలిసి ఎలా అధిగమించారన్నది ఇందులో కీలకం. తెలుగు, తమిళంతోపాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేస్తున్నాం. తదుపరి మా సంస్థలో తిరువీర్ కథానాయకుడిగానే మరో సినిమాని రూపొందిస్తాం. సత్యదేవ్ కథానాయకుడిగానూ ఓ సినిమాని చేస్తాం'' అని చెప్పారు.

# మాస్ లీడర్ నుంచి క్లాస్ లీడర్



కన్నడ అగ్రతార శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఆయన ప్రధానపాత్రలో రూపొందుతున్న చిత్రాల నుంచి సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త కబుర్లని వినిపించాయి ఆయా నిర్మాణసంస్థలు. పవన్ వడేయార్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'బెయిల్'. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్ పోలీసు అధికారి పాత్రలో నటిస్తున్నట్లు స్పష్టం చేస్తూ చిత్రబృందం ఆయన లుక్కుకి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించింది. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ముస్తాబవుతున్న ఈ సినిమా అక్టోబరు 2న విడుదల కానుంది. దీక్షిత్ శెట్టి, సంజనా ఆనంద్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. శివ రాజ్‌కుమార్ కథానాయకుడిగా కన్నడలో ఆయన భార్య గీతా శివ రాజ్‌కుమార్ నిర్మిస్తున్న చిత్రమే 'ఎ ఫర్ ఆనంద్'. శ్రీని తెరకెక్కిస్తున్నారు. 'ఫస్ట్ బెల్ రింగ్స్' పేరుతో తాజాగా ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్ క్లాస్ టీచర్‌గా నటిస్తున్నట్లు తెలియజేస్తూ చిత్రబృందం ఆయనకు సంబంధించిన ఓ వీడియోను విడుదల చేసింది. మాస్ లీడర్‌లాంటి రాజ్‌కుమార్ క్లాస్ లీడర్‌లా మారుతున్నారనే సన్నివేశాలతో ఆకట్టుకుంటోందీ వీడియో. శివ రాజ్‌కుమార్, అభిషన్ జీవింత్ కాంబోలో తమిళంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. శివానీ నాగారం కథానాయిక. గౌతమ్ శివరామన్ దర్శకుడు. డ్రామా కంపెనీ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని బాలమురుగన్ ఎ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్ 'షణ్ముగం' అనే పాత్రలో నటిస్తున్నారని నిర్మాణసంస్థ ఇన్‌స్టాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని పంచుకుంది.



# ప్రతి పాట ఓ విశ్వవిద్యాలయం

పాటల కోయిల ఎస్.జానకి గాయనిగానే కాదు... ఒక వ్యక్తిగానూ ఎంతోమందికి ఇష్టం. అందుకే ఆమెలో నిన్న, నేటితరం ఓ అమ్మని చూసుకుంటుంది. 'జానకమ్మ' అని ప్రేమగా పిలుచుకుంటుంది. అందులో ప్రముఖ నేపథ్య గాయని సునీత ఒకరు. ఆమె జానకమ్మ వ్యక్తిత్వాన్ని ఎంతో ఇష్టపడతారు. ఆమెతో కలిసి కొన్ని వేదికల్ని పంచుకున్నారు. దివికేగిన జానకి చివరి చూపు కోసం ఆదివారం మైసూర్ వెళ్లారు సునీత. పాటల కోయిలమ్మతో తనకున్న అనుబంధాన్ని, ఆమె వ్యక్తిత్వంలోని గొప్పతనాన్ని 'ఈనాడు సినిమా'తో పంచుకున్నారు సునీత. ''ఎప్పుడు కలిశానో తెలియదు కానీ... 18 నెలల వయసున్నప్పుడు జానకమ్మ పాటని పాడాను. అది మా అమ్మ చెబితే నాకు తెలిసింది. జానకమ్మ కంటే ముందు ఆవిడ గొంతు నాకు పరిచయమైంది. ఆవిడ తర్వాత వచ్చిన మూడో తరం గాయనిని నేను. దాంతో కలిసి పాడే అదృష్టం నాకు దక్కలేదు. ఈటీవీ 'ఝుమ్మంది నాదం' సహా ఎన్నో వేదికల్ని పంచుకున్నాం. నన్ను మాత్రమే కాదు, ఎవరు పాడినా 'చాలా బాగా పాడావు నాన్న...' అని మెచ్చుకునే ఉన్నతమైన వ్యక్తిత్వం ఆమెది. పాటలంటే చాలామందికి ఇష్టం ఉంటుంది. సినిమాల్లో పాడితేనే గాయకులు కాదు కదా. సంగీతం వచ్చిన ప్రతి ఒక్కరినీ మెచ్చుకుంటారు తప్ప, ఎవ్వరినీ జడ్జ్ చేసేవారు కాదు. అమ్మ పాట, జీవితం నుంచి నేర్చుకున్నవాళ్లకు నేర్చుకున్నంత. ప్రతి పాట ఓ విశ్వవిద్యాలయం. భావాల్ని అర్థం చేసుకోవడానికి తగిన పరిజ్ఞానం, లోతు మనిషికి ఉండాలని జానకమ్మ పాడిన ప్రతి పాట నేర్పుతుంది. జీవిత ప్రయాణంలో ఆవిడ ఎన్నిసార్లు పడ్డారో అన్నిసార్లు ఉవ్వెత్తున లేచి నిల్చున్నారు. అందుకే జానకమ్మ పాట, ఆవిడ జీవితం స్ఫూర్తిదాయకం'' అన్నారు సునీత.

# ధనుష్ చిత్రంలో విజయ్ సేతుపతి..?

కథానాయకుడు ధనుష్ ప్రధాన పాత్రలో వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'తమిళ మురుగన్'. వండర్‌బాల్ ఫిల్మ్స్, ప్రొడక్షన్ మైల్స్ టు గో సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్‌లుక్ గ్లింప్స్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విలక్షణ నటుడు విజయ్ సేతుపతి తన సామాజిక మాధ్యమాల వేదికగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను షేర్ చేయడంతో ఈ ప్రాజెక్ట్‌లో ఆయన ఓ కీలక పాత్రలో కనువిందు చేయబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. దర్శకుడు వెట్రి మారన్, విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో 'విడుదలై', 'అరసన్' చిత్రాలు రూపొందాయి.



# తండ్రి బాటలోనే జాసన్ సంజయ్.. హాట్ టాపిక్‌గా మారిన పోస్ట్?



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. అంతా ఆయన హీరోగా వస్తాడనుకుంటే.. దర్శకుడిగా బాధ్యతలు చేపట్టారు. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ హీరోగా 'సిగ్మా' అనే యాక్షన్ చిత్రాన్ని ఆయన తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రాన్ని జూలై 30న థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఇందులో సందీప్ కిషన్ సరసన 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం ఈమూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న నేపథ్యంలో, తాజాగా జాసన్ సంజయ్ ఓ షాకింగ్ నిర్ణయం తీసుకున్నట్లు నెట్టింట వస్తున్న వార్తలు సంచలనంగా మారాయి. డైరెక్షన్ చేస్తున్న సంజయ్, ఇప్పుడు హీరోగా కూడా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు సమాచారం.

తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకులు అభిషన్ జీవింత్, అశ్వత్ మరిముత్తుల బాటలోనే ఆయన కూడా నడవాలని భావిస్తున్నారట. వీరిద్దరు దర్శకత్వం తర్వాత హీరోలుగా వెండితెరపైకి వచ్చారు. ఇక జాసన్ కూడా త్వరలోనే హీరోగా ఒక క్రేజీ సినిమా చేయబోతున్నట్లు టాక్. ఈ మూవీని ఒక పాపులర్ డైరెక్టర్ తెరకెక్కించబోతుండగా, 'పరిమళం అండ్ కో' నిర్మాత కుమారన్ ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణ బాధ్యతలను భుజాన వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన కథా చర్చలు కూడా ముగిశాయని, సంజయ్ హీరోగా చేయబోయే ఈ ప్రాజెక్ట్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మొత్తానికి అటు దర్శకుడిగా తన మొదటి సినిమా 'సిగ్మా' విడుదలకు సిద్ధమవుతుండగానే, ఇటు హీరోగా మారేందుకు సంజయ్ అడుగులు వేస్తుండటం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు తండ్రి బాటలోనే నడుస్తూ.. స్టార్ హీరోగా మారతాడని అభిప్రాయపడుతున్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394